క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాలకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బాలమురళీకృష్ణ శుక్రవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కార్యక్రమం నిర్వహించడం లేదని పేర్కొన్నారు. మార్చి 8 తర్వాత కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తామని, ప్రజలు గమనించాలని కోరారు.

11 మంది పందెంరాయుళ్ల అరెస్ట్



పట్టుబడిన నిందితులతో పోలీసులు

కొమరాడ: మండలంలోని దళాయిపేట గ్రామ సమీపంలో గొర్రెపందాలు నిర్వహిస్తున్న వారిపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ సందర్భంగా 11 మంది నిందితులతో పాటు ఒక పొట్టేలు, 7,760 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీలంకంఠం తెలిపారు.

సన్మానం

పాలకొండ: విధి నిర్వహణలో అందించిన సేవలతోనే గుర్తింపు వస్తుందని తహసీల్దార్ బాలమురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన వీఆర్‌ఓ పాలవలస రమేష్‌కుమార్‌ను సహచర ఉద్యోగులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘ నాయకులు వై. లిల్లీపుష్పనాథం, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



గురండిలో వాహన తనిఖీలు చేస్తున్న బత్తిలి ఎస్సై అనిల్‌కుమార్, సిబ్బంది

భామిని: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బత్తిలి ఎస్సై డి. అనిల్‌కుమార్ సూచించారు. మండలంలోని గురండి కూడలిలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టి, వాహనచోదకులకు పలు సూచనలు చేశారు. తనిఖీల్లో ఏఎస్సై కాంతారావు, సిబ్బంది ఉన్నారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండల కేంద్రంలో పైడిమారమ్మ ఆలయ నిర్మాణానికి సంబంధించి గ్రామపెద్దలు శుక్రవారం భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, రంజిత్‌కుమార్, రామకృష్ణ, పోలినాయుడు, బుజ్జి, కార్తీక్, తదితరులతో పాటు అనువంశిక ధర్మకర్త బూరుబు నారాయణరావు మాట్లాడుతూ.. సుమారు 40 లక్షల రూపాయల వ్యయంతో ఆలయం నిర్మించనున్నట్లు చెప్పారు. దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్ నిషార్, ఎంపీటీసీ సభ్యుడు బంగారునాయుడు పాల్గొన్నారు.

శిథిల భవనం విధులు భయం.. భయం..



డివిజన్ పశు వైద్య కేంద్రం కొనసాగుతున్న షెడ్ ఇదే

- పాడి రైతులకు నీడ కరువు
- పశు వైద్యానికి అవస్థలు పడాల్సిందే
- కొత్త భవనాల ఊసే లేదు
- ప్రతిపాదనలు చేశాం: ఎ.డి మాణిక్యాలరావు



శిథిలాల మధ్యలో ఉండిపోయిన మందులు, పరికరాలు

పాలకొండ: డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలో పశువైద్యానికి తూట్లు పడుతున్నాయి. శిథిల భవనంలో విధులు నిర్వహించలేక వైద్యసిబ్బంది.. నిలువ నీడలేక పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. పాత భవనాలు పూర్తిగా శిథిలమై కొద్ది కొద్దిగా కూలిపోవడంతో చిన్న రేకుల షెడ్ వేసుకుని సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో రైతులతో పాటు పశువులకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయ సమీపంలో పశువైద్య కేంద్రం ఉంది. 1978లో నిర్మించిన పురాతన భవనాల్లో పశువులకు వైద్యసేవలు అందించేవారు. కొన్నాళ్లుగా భవనాలు కొద్దికొద్దిగా కూలిపోవడంతో శిథిలాల కింద మందులు, వైద్య పరికరాలు ఉండిపోయాయి. గతేడాది భవనం పూర్తిగా కూలిపోయింది. అప్పటి నుంచి చిన్న రేకుల షెడ్ ఏర్పాటు చేసుకుని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

రూ. 50 లక్షలు కేటాయించినా..

గత ప్రభుత్వంలో నూతన భవనాల నిర్మాణం కోసం రూ. 50 లక్షలు మంజూరు చేశారు. స్థల వివాదం కారణంగా అప్పట్లో పనులు జరగలేదు. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల సమయంలో కూడా కూటమి నాయకులు పశువైద్య కేంద్రానికి కొత్త భవనాలు నిర్మిస్తామని హామీలు గుప్పించారు. తీరా ప్రభుత్వం కొలువుదీరాక ఆ విషయమే మరిచిపోయారు.

ఏకైక ఆధారం..

పాలకొండ పట్టణ పరిసర ప్రాంత రైతులకు ఈ పశువైద్య కేంద్రమే ఆధారం. పట్టణంలో సుమారుగా 549 మంది రైతుల వద్ద 3,750 పశువులు, 454 గేదెలు, 8,788 గొర్రెలు, 4,200 మేకలు, 20,994 కోళ్లు ఉన్నాయి. వీటన్నింటినీ వైద్యం కోసం పాలకొండలోని పశువైద్య కేంద్రానికే తీసుకురావాల్సి ఉంటుంది.

ప్రతిపాదనలు చేశాం..



ప్రస్తుత భవనాల పరిస్థితిని వివరించి కొత్త భవనాల కోసం ప్రతిపాదనలు చేశాం. కలెక్టర్‌తో పాటు పశు సంవర్థక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డులో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

– మాణిక్యాలరావు, పశుసంవర్థక శాఖ ఎ.డి



శిథిల భవనం

స్థలం సమస్య వీడలేదు..

వాస్తవానికి పశువైద్య కేంద్రం స్థలం 16 సెంట్లు. ఇందులో నూతన భవనాల కోసం 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 30 లక్షల రూపాయలు మంజూరైంది. పనులు జరుగుతున్న సమయంలో అప్పటి టీడీపీ నాయకులు ఈ స్థలం కోటదుర్గమ్మ ఆలయానికి అప్పగించాలని పట్టుబట్టారు. ఇందుకు బదులుగా రామలింగేశ్వర స్వామి ఆలయానికి చెందిన 50 సెంట్లు స్థలం కేటాయిస్తామని తెలిపారు. అయితే దేవదాయ, పశువైద్యశాఖల మధ్య ఉన్న సాంకేతిక కారణాలతో ఈ సమస్య పరిష్కారం కాలేదు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణ వ్యయం పెరిగిందనే ఉద్దేశంతో రూ. 50 లక్షలు మంజూరు చేసినా, స్థల సమస్య పరిష్కారం కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.



వైద్యం కోసం షెడ్‌లోనే ఉంచిన మందులు

కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించండి



తాడికొండ పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

- డాక్టర్ బుద్ధేశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: కుష్ఠు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13 వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్పర్శలేని మచ్చలుంటే కుష్ఠు వ్యాధిగా అనుమానించాలన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- పశుసంవర్థక శాఖ అదనపు డైరెక్టర్ సింహాచలం

సీతంపేట: పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ వై.సింహాచలం అన్నారు. మండలంలోని పణుకువలసలో ఉచిత పశు వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పశువులను శిబిరాలకు తీసుకువచ్చి రోగాలను నయం చేయించుకోవాలని సూచించారు. పాల విక్రయాల ద్వారా అదనపు ఆదాయాలు పొందవచ్చన్నారు. 18 పశువులకు సాధారణ చికిత్సలు.. 45 ఆవులు, 28 దూడలకు నట్టల నివారణ మందులు, 13 ఆవులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు.. 9 ఆవులకు చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖాధికారి ఎస్.మన్మథరావు, డిప్యూటీ డైరెక్టర్ సత్యప్రకాష్, ఎ.డి శ్రీనివాస్, దోనుబాయి పశువైద్యాధికారి ఆర్‌జీజే శంకరరావు, సిబ్బంది, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.



సీతంపేట: పశు వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న అదనపు డైరెక్టర్ సింహాచలం

వాటపాగులో..

పాలకొండ రూరల్: మండలంలోని వాటపాగులో నిర్వహించిన పశు వైద్యశిబిరాన్ని పశు సంవర్థక శాఖ రాష్ట్ర అదనపు సంచాలకుడు ఎండ సింహాచలం, జిల్లా అధికారి ఎస్.మన్మథరావు పరిశీలించారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.



పాలకొండ రూరల్: పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశు సంవర్థక శాఖాధికారులు

పాఠశాల సందర్శన...

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేకాధికారి, డీజీపీఓ టి. కొండలరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ఆయన సమావేశమై పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు.

వారి సామర్థ్యాలను అంచనా వేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. రమేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి కొండలరావు

అండగా ఉంటాం..

సీతంపేట: మండలంలోని జి.గుమ్మడ గ్రామానికి చెందిన బిడ్డిక అన్నపూర్ణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రధాని, వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్.మోహనరావు, కె.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటు

వీరఘట్టం: ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 119 మంది ఓటర్లు ఉన్నారని, వారందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి సల్మాన్‌రాజు

పాలకొండ రూరల్: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా ప్రత్యేకాధికారి సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో చేతిబోర్లు, రక్షిత పథకాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవల్లిక, ఎంఈ కృష్ణమూర్తి, ఏఈ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

అగ్ని అస్త్రంతో పురుగుల నివారణ

బలిజిపేట: మొక్కజొన్నకు సోకిన కత్తెర పురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తయారు చేసిన అగ్ని అస్త్రం ద్రావణం ఉపయోగపడుతుందని ఏపీసీఎన్‌ఎఫ్ మండల ఇన్‌చార్జి లక్ష్మి అన్నారు. వెంగళరాయపురంలో అగ్ని అస్త్రం తయారీపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించి ద్రావణాన్ని తయారు చేశారు. దీని వల్ల పచ్చ పురుగు, కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు తదితర పెద్ద పురుగుల నివారణకు అన్ని రకాల పంటల్లో వినియోగించవచ్చన్నారు.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు ఎక్కడా రాజకీయ నాయకుల పోస్టర్లు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనల అమలుపై తగు జాగ్రత్తలు తీసుకునేందుకు అధికారులకు సూచనలు చేశామని తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై పి.రమేష్‌నాయుడు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత హక్కులను కాలరాయడం క్షమించరాని నేరమన్నారు. గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ కులాలవారిని ప్రత్యేకంగా చూసినట్లు ఫిర్యాదులందితే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు యువత, వ్యాపారులు పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచుకోవాలి..

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: పీహెచ్‌సీలో మందులన్నీ అందుబాటులో ఉంచుకోవాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం సీతంపేటలోని పట్టు రీలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పట్టు పరిశ్రమ ద్వారా వచ్చే ఆదాయం, కార్మికులకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కారిగూడలో మల్బరీ తోటను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భానుప్రతాప్, సెరికల్చర్ ఎ.డి సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు.



వైద్యాధికారికి సూచనలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

రైతులకు అవగాహన..

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగిలో మొక్కజొన్న పంటలో అధిక దిగుబడులు సాధించడంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం రస్తాకుంటుబాయికి చెందిన అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్నలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గా, డాక్టర్ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.



పెదమేరంగిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

రక్తహీనత నివారణే ధ్యేయం



కొమరాడ: అంగన్‌వాడీ సిబ్బందికి కిట్లు అందజేస్తున్న సీడీపీఓ సుగుణకుమారి

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణే ధ్యేయంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి జి.సుగుణకుమారి అన్నారు. మండలంలోని గరుగుబిల్లి, పెదగుడబ, రావివలస ఐసీడీఎస్ సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం సందర్శించి 76 పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు తక్షణమే వైద్యసేవలు అందించాలన్నారు. పరిశీలనలో పెదగుడబ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, రావివలస సెక్టార్ సూపర్‌వైజర్ అరుణకుమారి, తదితరులున్నారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి..

కొమరాడ: రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు సీడీపీఓ జి.సుగుణకుమారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లోని కేంద్రాలకు 172 కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారదమాంబ, తదితరులు ఉన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి ..



చేసిన సేవలే గుర్తింపునిస్తాయని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పొల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి పదవీ విరమణ చేసిన మీనక భాస్కరరావును అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్‌లు ఎ.కళావతి, హెచ్.ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్.మోహనరావు, కె.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

- సీతంపేట

రోడ్డు సౌకర్యం కల్పించరూ..



కురుపాం మండలంలోని మరుపల్లి పంచాయతీ గొల్లగానిగూడకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులతో పాటు ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ గ్రామస్తులు గోతులతో నిండిన రహదారిని శుక్రవారం శ్రమదానం చేస్తూ బాగు చేసుకున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మరుపల్లి నుంచి గొల్లగానిగూడకు రోడ్డు వేయాలని కోరారు. - గుమ్మలక్ష్మీపురం (కురుపాం)

పరామర్శ..



భామిని మండలం సతివాడకు చెందిన బొల్లు లక్ష్మో (68) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈమె వెంట వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పాత్రుకొండ రాంబాబు, ఉప సర్పంచ్ దామోదర అప్పన్న, పార్టీ నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, పతివాడ పగడాలమ్మ ఉన్నారు. - భామిని